కడప ద్వారకానగర్‌లోని శ్రీకృష్ణుడి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



కన్నుల పండువగా కృష్ణాష్టమి వేడుకలు



జిల్లా వ్యాప్తంగా వైష్ణవాలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలు సత్యభామ, గొల్లభామ, బాలకృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు.

- కడప (కల్చరల్)

ద్వారకానగర్‌లో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

రేపటి నుంచి జోనల్ చెస్, క్యారమ్స్ టోర్నమెంట్

కడప (నాగరాజుపేట), ఆగస్టు 26: ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఎల్ఐసీ సిబ్బంది జోనల్ చెస్, క్యారమ్స్ టోర్నమెంటును కడపలో బుధవారం నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఎల్ఐసీ కడప సీనియర్ డివిజనల్ మేనేజరు జీకేఆర్‌వీ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 28వ తేదీ బుధవారం ఉదయం మద్రాసు రోడ్డులోని హోటల్ శ్రీనివాసరెసిడెన్సీలో ఈ టోర్నమెంటు ఎల్ఐసీ జోనల్ హెచ్ఆర్‌డీ రీజనల్ మేనేజరు కేవీ సత్యవాణి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ టోర్నమెంటులో అంతర్జాతీయ ఎల్ఐసీ క్రీడాకారిణి, హైదరాబాదు డివిజన్ ఉద్యోగి అపూర్వ పాల్గొంటున్నారని తెలిపారు.

జగన్ పాలనలో.. నిబంధనలకు నీళ్లు

- కేజీఎఫ్ గనులను తలపించేలా ఇసుక తవ్వకాలు
- అడ్డగోలుగా అమ్మినా అడిగే నాధుడే లేడు
- ఇసుక అక్రమ తవ్వకాలపై ఏసీబీ గురి
- త్వరలోనే విచారణ ప్రారంభం

(కడప-ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం వచ్చిన కన్నడ సినిమా కేజీఎఫ్ గుర్తుంది కదా.. అందులో బంగారం కోసం తవ్వకాలు జరుపుతారు. పెద్ద పెద్ద గోతులు ఏర్పడతాయి. సేమ్ టు సేమ్ జగన్ పాలనలో నిబంధనలకు నీళ్లొదిలి చేపట్టిన ఇసుక తవ్వకాల వల్ల జిల్లాలోని నదులు కేజీఎఫ్ గనులను తలపించాయి. వాల్టా చట్టానికి తూట్లు పొడిచి పర్యావరణాన్ని అటకెక్కించి అడ్డగోలుగా తవ్వేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇసుకను లూటీ చేసినా అడ్డుకునే నాధుడే కరువయ్యారు. ఇసుక తవ్వకాలపై అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక తవ్వకాలపై దృష్టి సారించింది. ఉమ్మడి కడప జిల్లాలో ఇసుక తవ్వకాలపై ఏసీబీ విచారణ జరపనుంది. ఈ మేరకు ఏసీబీ అధికారులు గనులశాఖ కార్యాలయంలో 2021 మే నుంచి 2023 నవంబరు వరకు జేపీ పవర్ వెంచర్స్ చేపట్టిన ఇసుక తవ్వకాలకు సంబంధించిన డేటాను తీసుకుంది. ఎన్ని రీచ్‌లు కేటాయించారు, అక్కడ ఎంత క్వాంటిటీ ఇసుక ఉన్నది, ఎంత తవ్వారు అన్న సమాచారాన్ని ఏసీబీ అధికారులు గనుల శాఖ నుంచి తీసుకున్నారు. త్వరలోనే విచారణ మొదలు కానున్నట్లు చెబుతున్నారు.





పాపాఘ్నిలో ఇసుక తవ్వకాలు (ఫైల్‌ఫొటో)

అడ్డగోలుగా తవ్వేశారు

విభజిత రాష్ట్రానికి 2014-19 కాలంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేశారు. 2019లో జగన్ సీఎం అయ్యాక ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేశారు. నూతన విధానం అంటూ ఏడాదికి పైగా కాలం వృథా చేశారు. అప్పట్లో నిర్మాణరంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లింది. పనులు లేక భవన నిర్మాణ కార్మికులు పస్తులు ఉన్నారు. ఆలస్యంగా జగన్ సర్కారు కొత్త విధానం తీసుకువచ్చింది. జేపీ పవర్ వెంచర్‌కు ఇసుక తవ్వకాలను కట్టబెట్టింది. ఉమ్మడి జిల్లాలో పాపాఘ్ని, కుందూ, చెయ్యేరు నదుల్లో మొత్తం 24చోట్ల రీచ్‌లకు అనుమతిచ్చారు. కొద్దిరోజులు జిల్లాలో ఇసుక జయప్రకాశ్ పవర్ వెంచర్స్ (జేపీ) చేపట్టింది. అయితే మాజీ సీఎం జగన్ బంధువు వీరారెడ్డి సబ్ లీజుకు తీసుకున్నారు. ఆయన రీచ్‌ల వారీగా మళ్లీ సబ్ లీజుకు ఇచ్చారు.

గగ్గోలు పెట్టినా...

ఇసుక తవ్వకాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిళ్లుతుందని పలువురు గగ్గోలు పెట్టారు. అలాగే తాగునీటి పథకాలకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాల్టా చట్టానికి అనుగుణంగా ఇసుక తవ్వకాలు జరపాల్సి ఉంది. ఈ మేరకు మీటరు లోపు మాత్రమే తవ్వాలి. అయితే పెద్ద పెద్ద ఎక్సకవేటర్లు పెట్టి ఇష్టారాజ్యంగా తవ్వేశారు. కొన్నిచోట్ల మూడుమీటర్లకు పైగానే తవ్వకాలు జరిగాయి. ఆరడుగుల ఎత్తున్న మనిషి ఇసుక తీసిన ప్రాంతానికి వెళ్లి చేతులు పైకెత్తినా కనిపించనంత లోతుతో గోతులు ఏర్పడ్డాయి. ఇసుకను అడ్డగోలుగా రవాణా చేస్తున్నా అప్పట్లో అడిగేవారు లేరు. రీచ్ ఒక చోట తవ్వకాలు మరోచోట చేసినా కూడా పట్టించుకోలేదు. కమలాపురం, చెన్నూరు, ఖాజీపేట ప్రాంతాల్లో తాగునీటికోసం నదుల్లో వేసిన పైపులు దెబ్బతిన్నాయి. దీనిపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. చివరికి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వల్లూరు సమీపంలో పుష్పగిరి వద్ద ఇసుక తవ్వకాలు జరుగుతుండడంపై గ్రామస్తులు అడ్డుకున్నారు. చివరకు టీడీపీ నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే కానీ ఇక్కడ తవ్వకాలు ఆగలేదు.

ఏసీబీ విచారణతో

పుట్‌పాత్‌లో గంపల్లో పండ్లు అమ్మే వ్యాపారుల వద్ద కూడా ఆన్‌లైన్ పేమెంటు ఉంటుంది. ఇసుక త్వవకాలు జరిగే రీచ్‌ల వద్ద మాత్రం నో డిజిటల్ పేమెంట్లు. ఓన్లీ క్యాషే. బిల్లులు కూడా కంప్యూటర్ కాదు. మాన్యువల్ బిల్లులే ఇచ్చారు. అసలు ఎన్ని హెక్టార్లలో ఎన్ని క్యూబిక్ మీటర్లు తవ్వాలి అనేది అనుమతి ఇచ్చినప్పవడు ఉండే కాగితంపై ఉన్న వివరాలు తప్ప.. నదుల్లో ఎంత తవ్వేసినా ఆ రోజుల్లో పట్టించుకోలేదు. ఏసీబీ విచారణతో ఈ వివరాలన్నీ ఇప్పుడు వెలుగుచూడనున్నాయి.

రక్తమోడిన రోడ్లు..



నుజ్జు నుజ్జయిన కారులో నుంచి ఎక్సకవేటర్ సాయంతో మృతదేహాలను బయటకు తీస్తున్న దృశ్యం



కారులో చిక్కుకుపోయిన మృతదేహాలు

జిల్లాలో సోమవారం రెండుచోట్ల ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. గువ్వల చెరువు ఘాట్‌లో ఎదురుగా వస్తున్న కారును కంటైనర్ ఢీకొని లోయలోకి వెళ్లిపోయింది. ఈ ఘటనలో కారులో ఉన్న నలుగురితో పాటు కంటైనర్ డ్రైవర్ మృతిచెందాడు. భర్త దశదిన కర్మ అనంతరం బంధువుల ఇళ్లలో దీపం చూసి వచ్చేందుకు బయలుదేరిన భార్యతో పాటు ఆమె బంధువులు ఇద్దరు చనిపోయారు. కుమార్తె పుట్టు వెంట్రుకల మొక్కు తీర్చుకునేందుకు బంధువులతో కలసి కర్నూలు నుంచి తిరుమల వెళుతుండగా దువ్వూరు మండలంలో వీరి వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆ చిన్నారి తీవ్రంగా గాయపడగా.. తండ్రి మరొకరు మృతిచెందారు. ఈ రెండు ప్రమాదాలతో.. ఒక కుటుంబం విషాదం నుంచి తేరుకోకముందే మరింత విషాదం నెలకొనగా.. మరో కుటుంబం సంతోషంగా ఉండాల్సిన సమయంలో దుఃఖంలో కూరుకుపోయింది.



వెంకటమ్మ, నాగలక్ష్మి (ఫైల్‌ఫొటోలు)



డ్రైవర్ మహబూబ్ షరీఫ్ (ఫైల్‌ఫొటో)

గువ్వలచెరువు ఘాట్‌లో ఘోర ప్రమాదం

- కారును ఢీకొన్న కంటైనర్
- ఐదుగురు మృతి.. మృతుల్లో ముగ్గురు సమీప బంధువులు
- దుర్ఘటనపై మంత్రి దిగ్భ్రాంతి

రాయచోటి / రామాపురం / చక్రాయపేట / సీకేదిన్నె (ఆంధ్రజ్యోతి): కడప- రాయచోటి మార్గంలోని గువ్వలచెరువు ఘాట్‌లో సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఘోర ప్రమాదం జరిగింది. కారును కంటైనర్ ఢీకొన్న ఈ దర్ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు సమీప బంధువులు.. పోలీసుల కథనం మేరకు..

చక్రాయపేట మండలం కొండివారిపల్లె కుప్పానికి చెందిన అంగన్వాడీ ఆయాగా పనిచేసే చిన్నవెంకటమ్మ(50) భర్త సత్యనారాయణ ఇటీవల చనిపోయారు. అతని దశదినకర్మ ముగియడంతో.. సంప్రదాయం ప్రకారం ఆమె వరుసకు కోడలైన నాగలక్ష్మి(35), తమ్ముడు నాగయ్య (48)తో కలసి బంధువుల ఇళ్లలో దీపం చూడడానికి బాడుగ కారులో బయలుదేరారు. చక్రాయపేట నుంచి వేంపల్లె, ఎర్రగుంట్ల, కడపలో బంధువుల ఇళ్లలో దీపం చూసి... అన్నమయ్య జిల్లా గువ్వలచెరువులోని బంధువుల ఇళ్లకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు గువ్వలచెరువు ఘాట్‌లో వెళుతుండగా నాలుగో మలుపు వీరికి ఎదురుగా భారీ కంటైనర్ వచ్చింది. అక్కడ దిగువ వాలు ఎక్కువగా ఉండటంతో వేగంగా వచ్చిన కంటైనర్ అదుపు తప్పి కారును ఢీ కొంది. దీంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయిపోయింది. కారులో ఉన్న వాళ్లు అందరూ తీవ్ర గాయాల పాలై.. కారులోనే మృతి చెందారు. కారును ఢీకొన్న తర్వాత కంటైనర్ అదే వేగంతో వెళ్లి లోయలో పడిపోయింది. దీంతో అందులోని డ్రైవర్ కూడా మృతి చెందారు. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురు చనిపోగా. ఇప్పటి వరకు కారు డ్రైవర్ వివరాలు ఎవరైంది తెలియలేదు. మిగిలిన మృతులు ముగ్గురూ సమీప బంధువులు అవుతారు. వీరితో పాటు కారు డ్రైవర్ మహబూబ్ షరీఫ్(45) కూడా మృతిచెందాడు.



సంఘటన స్థలంలో కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



విలపిస్తున్న డ్రైవర్ మహబూబ్‌షరీఫ్ భార్య పిల్లలు

సంఘటన స్థలానికి కడప ఎస్పీ

ప్రమాదం విషయం తెలియగానే.. కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సంఘటన స్థలానికి వచ్చారు. ప్రమాదానికి గల కారణాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గురైన కారు నడిరోడ్డుపైనే ఉండిపోవడంతో.. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. కారులో చిక్కుకుపోయిన వాళ్ల మృతదేహాలను బయటకు తీశారు. ఆయనతో పాటు ఎస్పీ ఇన్‌స్పెక్టర్ వెంకటశివ, సీకేదిన్నె సీఐ శంకర్‌నాయక్, రామాపురం ఎస్ఐ వెంకట కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామంలో విషాదం

చక్రాయపేట మండలం కొండివారిపల్లె కుప్పానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఎటు చూసినా రోద నలే. ముఖ్యంగా డ్రైవర్ మహబూబ్ షరీఫ్‌కు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. వీరిది పేద కుంటుంబం కావడం యజమాని మృతితో వారి రోదన వర్ణనాతీతంగా మారింది.

మంత్రి దిగ్భ్రాంతి

ప్రమాద సంఘటనపై రాష్ట్ర రవాణ, యువజన, క్రీడా శాఖా మంత్రి మండిపల్లె రాం ప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గువ్వలచెరువు ఘాట్‌లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణ కోసం శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. వాహనదారులు ప్రయాణించేటపుడు చాలా జాగ్రత్తగా రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఘాట్‌లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా.. పటిష్ఠ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

జీపు బోల్తా పడి ఇద్దరి మృతి

- మొక్కు తీర్చడానికి వెళుతూ..
- తిరిగిరాని లోకాలకు

మైదుకూరు రూరల్, ఆగస్టు 26: పుట్టు వెంట్రుకల మొక్కు తీర్చడానికి తిరుమలకు వెళుతుండగా వారు ప్రయాణిస్తున్న జీపు బోల్తా పడి తండ్రి, అతని పెద్దమ్మ మృతిచెందిన విషాద ఘటన కడప జిల్లా దువ్వూరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు నగరంలో నివాసం ఉండే బొందిలి భగత్‌సింగ్ (31) వృత్తిరీత్యా ఫ్లెక్సీల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి కూతురు పుట్టింది. ప్రస్తుతం ఆ పాపకు తొమ్మిది నెలలు. దీంతో పాపకు పుట్టు వెంట్రుకల మొక్కు తీర్చుకునేందుకు కుటుంబసభ్యులు, బంధువులు కలసి మొత్తం 19 మందితో సోమవారం తమ సొంత వాహనంతో పాటు మరో వాహనం బాడుగకు తీసుకుని తిరుమలకు బయలుదేరారు. ఈ క్రమంలో కడప జిల్లా దువ్వూరు మండలం చింతకుంట వద్దకు రాగానే భగత్‌సింగ్ నడుపుతున్న జీపు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో భగత్‌సింగ్‌తో పాటు అతని పెద్దమ్మ నాగలక్ష్మీబాయ్(65) అక్కడికక్కడే మృతి చెందగా.. తొమ్మిది నెలల చిన్నారి కియాబ్‌సింగ్ తీవ్రంగా గాయపడ్డారు. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. చిన్నారిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం 108 వాహనంలో తరలించగా మిగతా ఐదుగురు మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో యుగంధర్‌సింగ్, కల్యాణ్‌సింగ్, సుభాన్, కవితాబాయి ఉన్నారు.



భగత్‌సింగ్, నాగలక్ష్మిబాయ్

సీఐడీ విచారణ ముమ్మరం

- మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు చేరుకున్న సీఐడీ అధికారులు
- అనుమానితుల విచారణ ప్రారంభం!

మదనపల్లె టౌన్, ఆగస్టు 26: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసులో సీఐడీ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల నుంచి ఈనెల 3వ తేదీ సీఐడీకి బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి బదిలీ చేయడంతో 20 రోజులుగా క్షేత్రస్థాయిలో వీఆర్‌వోలను, తహసీల్దార్లను సీఐడీ అధికారులు రహస్యంగా విచారించినట్లు సమాచారం. దీనిపై పలు ఊహాగానాలు, పుకార్లు వస్తున్న నేపథ్యంలో సీఐడీకి కేసు బదిలీ అయిన 23వ రోజుల తర్వాత సోమవారం రాత్రి సీఐడీ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. ఈ కేసును విచారిస్తున్న దర్యాప్తు అధికారి అదనపు ఎస్పీ రాజ్‌కమల్, సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు చేరుకున్నారు. సబ్‌కలెక్టరేట్‌లోని అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సంఘటన జరిగిన సమయంలో అక్కడే ఉన్న వీఆర్ఏ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజతో కలసి సీన్ రీకన్స్‌స్ట్రక్షన్ చేయనున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు కూడా మదనపల్లెకు చేరుకోవడంతో ఈ కేసు పురోగతి ముందుకు కదులుతున్నట్లు సమాచారం. దీంతో పాటు సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ కూడా మదనపల్లెకు రానున్నట్లు సమాచారం. ఏదిఏమైనా 23 రోజుల పాటు స్థబ్దుగా ఉన్న మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో దర్యాప్తునకు సీఐడీ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగడంతో విచారణ ముందుకు కదిలినట్లు తెలుస్తోంది. సబ్‌కలెక్టరేట్‌లోకి ఎవరినీ అనుమతించకుండా పోలీసులు గేట్లు మూసివేయడంతో లోపల ఏమి దర్యాప్తు జరుగుతుందో తెలియక ఉత్కంఠ నెలకొంది.

ఇప్పటికే 8 మందిపై కేసు

ఇందులో భాగంగా ఈ కేసులో అనుమానితులైన వీఆర్ఏ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ, ఇద్దరు ఆర్డీవోలు మురళి, హరిప్రసాద్‌ను పోలీసులు పలు కోణాల్లో విచారించారు. అంతేకాకుండా మదనపల్లె వన్‌టౌన్, టూటౌన్, తాలూకా పోలీసుస్టేషన్‌లలో 8 మందిపై కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జింకా వెంకటచలపతి, పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు వి.మాధవరెడ్డి, శశిధర్ ఇళ్లలో పోలీసులు సోదాలు చేసి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా వీరందరిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లతో కేసు నమోదు చేశారు. ఇందులో వి.మాధవరెడ్డి హైకోర్టులో ముందస్తు బెయిల్ తీసుకుని మదనపల్లెలో తిరుగుతుండటం విశేషం.

బిల్లులు రాక... సౌకర్యాలు లేక

- ఆగిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు
- ఆరు వందల ఇళ్లు.. పూర్తయ్యింది ఇరవైలోపే
- రోడ్లు లేవు, కరెంటు లేదు...
- పూర్తయిన ఇళ్లలో చేరేందుకు జంకుతున్న లబ్ధిదారులు

వేంపల్లె జగనన్న కాలనీలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు



వేంపల్లె, ఆగస్టు 26: గత వైసీపీ ప్రభుత్వం ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యమని.. ఇళ్లు నిర్మించి తాళం చెవి చేతికి ఇస్తామని బీరాలు పలికింది. జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి.. ఇళ్లు మంజూరు చేసింది. కాలనీల్లో లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన పేదలకు బిల్లులు రాక చాలా మంది నిర్మాణాలు చేపట్టక.. కొందరు ఇళ్లు నిర్మించుకున్నా.. కాలనీలో రోడ్లు, కరెంటు తదితర వసతులు లేక పోవడంతో ఇళ్లలో చేరాలా.. వద్దా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇది మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోని వేంపల్లెలో జగనన్న కాలనీ దుస్థితి.

బిల్లులు రాక ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం

వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీ వెనుకవైపు కొండ పక్కన జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ఆరు వందల ఇళ్లను మంజూరు చేశారు. రెండు సంవత్సరాలకు పైగా ఇళ్ల నిర్మాణం సాగుతూనే ఉంది. బిల్లులు ఇవ్వడంలో, వసతులు కల్పించడంలో జాప్యం చేయడంతో ఆరు వందల ఇళ్లలో ప్రస్తుతం అక్కడ ఇళ్లు పూర్తై చేరిన వారు 20 కుటుంబాలలోపే ఉన్నారు. మిగతా కొన్ని ఇళ్లు స్లాబ్‌లెవెల్లో, మరికొన్ని గోడల స్థాయిలో ఉండగా.. బేస్‌మెంట్ లెవెల్లో, ఇంకా మొదలు కాని స్థలాలు అక్కడ దర్శనమిస్తున్నాయి. మార్చి నెల నుంచి బిల్లులు రాలేదు. దీంతో అక్కడ ఇళ్ల నిర్మాణం పూర్తిగా నిలిచిపోయింది. కట్టుకునేందుకు బిల్లులు వస్తే మిగతా పనులు చేసుకునేందుకు ముందుకెళ్తారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకొని ఇళ్ల నిర్మాణానికి సహకారం అందించాల్సి ఉంది.

రోడ్లు లేవు... కరెంటు లేదు

జగనన్న కాలనీలో రోడ్లు సరిగా లేవు. మట్టిరోడ్లే ఉన్నాయి. కొండ సమీపంలో కాలనీలో ఏర్పాటు చేయడంతో మట్టిరోడ్డు ఎగుడుదిగుడుగా ఉన్నాయి. సిమెంటు రోడ్డు వేయాల్సి ఉండగా గత వైసీపీ ప్రభుత్వం



జగనన్న కాలనీలో రోడ్ల దుస్థితి

ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అలాగే విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినప్పటికి కరెంటు సరఫరా లేదు. వీధిలైట్లు బిగించినా వెలగడం లేదు. రాత్రి అయితే అంధకారంలో ఉంటోంది. విషపురుగులు ఎక్కువగా ఉండడంతో ఇళ్లు పూర్తైనప్పటికి చేరేందుకు లబ్ధిదారులు జంకుతున్నారు. ఇక ఇళ్లకు మీటర్లు బిగించి కరెంటు సరఫరా చేయాలని లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నప్పటికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదు. ప్రస్తుతం మీటర్లకు డబ్బు చెల్లించాలని చెబుతుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇక కాలనీలో తాగునీటి కోసం నాలుగు బోర్లు వేశారు. అక్కడ రెండు మాత్రమే పనిచేస్తుండడంతో సరిపడడం లేదు. ఇళ్లు నిర్మించుకోవాలంటే బాడుగకు ట్యాంకర్లు తెచ్చుకొని పనులు చేయాల్సిఉంది. నీటి కొరత కారణంగా ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతోందని చెప్పవచ్చు.

కాలనీలో సౌకర్యాలు కల్పించాలి



జగనన్న కాలనీలో వీధిలైట్లు అసలు వెలగవు. విషపురుగులతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు కాలనీలో చేరేలా అన్ని వసతులు కల్పిస్తే చాలా మంది ముందుకొస్తారు. ఇళ్లు నిర్మించుకొని చేరాను. ఇప్పటికి స్లాబ్ బిల్లుకు ఆన్‌లైన్‌లో ఎక్కించారు. బిల్లులు రాలేదు.

-మల్లికార్జున, లబ్ధిదారు, జగనన్నకాలనీ, వేంపల్లె.

మీటర్లు ఉచితంగా ఏర్పాటు చేయాలి



కాలనీలో ఇళ్లు నిర్మించుకొని పదిరోజుల క్రితం చేరాను. రాత్రి అయితే అంధకారంగా ఉంటోంది. విద్యుత్ మీటర్ బిగించి కరెంటు సరఫరా చేయాలి. గతంలో ఉచితంగా బిగిస్తామని చెప్పారు. కానీ ఇపుడు డబ్బు కట్టాలని విద్యుత్ అధికారులు అంటున్నారు. పేదలం డబ్బు చెల్లించి మీటర్ బిగించుకోలేము. ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలి.

-కొమ్మద్ది ఆంజనేయులు, లబ్ధిదారు, జగనన్నకాలనీ వేంపల్లె.

ఘనంగా పల్లా జాతీయ కవితా పురస్కారాల ప్రదానోత్సవం



వ్యాసతేజం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 26: తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం యువసాహితీ ఆధ్వర్యంలో పల్లా జాతీయ కవితా పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన అనిల్‌డ్యానీ రచించిన గాంధారీవాన పుస్తకానికి 2023 సంవత్సరానికి, శ్రీకాకుళంకు చెందిన కంచరాన భుజంగరావు రచించిన నీటి గింజల పంటకు 2024 సంవత్సరానికి పల్లా జాతీయ పురస్కారాలను అందజేసి.. రచయితలకు ఒక్కొక్కరికి రూ.5,116 నగదు బహుమతి, దుశ్శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ పల్లా కృష్ణ తన తండ్రి పల్లా నరసింహులు జ్ఞాపకార్థం జాతీయ పురస్కారాలను ఏర్పాటు చేసి తండ్రి రుణం తీర్చుకున్నారన్నారు. పల్లా కృష్ణ రచించిన కడప జిల్లా కథలు, వస్తు విస్తృతి, వైవిధ్యం పుస్తకాన్ని అందరు చదవాలని సూచించారు. కవి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ పల్లా కృష్ణ కవిగా, రచయితగా యువసాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, అధ్యాపకుడిగా విభిన్న కోణాల్లో తెలుగు సాహిత్యానికి విశేష సేవ చేస్తున్నారని కొనియాడారు. గాంధారీవాన పుస్తకంపై రచయిత సీసీ వెంకటేశ్వర్లు సమీక్ష చేస్తూ పుస్తక రచయిత అనిల్ డ్యానీ ప్రజల పక్షాన నిలబడిన కవి అని, కవులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రజల్లో చైతన్యం తీసుకురాగలరని పేర్కొన్నారు. నీటిగింజల పంట పుస్తకంపై రచయిత డాక్టర్ రాధేశ్యాం సమీక్షిస్తూ సమాజంలోని విభిన్న వృత్తులు, శ్రామికుల కష్టాలు, సమస్యల గురించి కవిత్వం ద్వారా చక్కగా వివరించారన్నారు. రచయిత పల్లా కృష్ణ మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా తండ్రిపేరుతో పల్లా జాతీయ పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవీయూనివర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, కమలాపురం సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ సీవీ రాజగోపాల్‌రెడ్డి, తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, రచయితలు చదువులబాబు, కొమ్మిశెట్టి మోహన్, కామనూరు రామమోహన్ తోట రామమోహన్, జింకా సుబ్రహ్మణ్యం, కొత్తపల్లె శ్రీను, పాములేటి, గొంటుముక్కుల గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

ఏటూరు ఇసుక రీచ్ ప్రారంభం



ఏటూరు ఇసుకరీచ్ వద్ద లబ్ధిదారునికి ఇసుక కూపన్‌ను అందజేస్తున్న ఆర్డీవో

కొండాపురం, ఆగస్టు 26: మండలంలోని ఏటూరు గ్రామం వద్ద ఇసుకరీచ్‌ను జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాస్, ఎన్డీయే కూటమి మండల ఇన్‌చార్జ్ శివ నారాయణరెడ్డిలు సోమవారం ప్రారంభించారు. ఏటూరు రీచ్‌కు సంబంధించిన స్టాక్ పూర్తిగా అమ్ముడు పోవడంతో కలెక్టర్ ఆదేశాలతో తిరిగి ఇసుకరీచ్‌ను ప్రారంభించారు. నాణ్యమైన ఇసుకను ప్రజలకు అందుబాటు తేవాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆర్డీవో తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుకను విచ్చలవిడిగా దోచుకున్నారని శివనారాయణరెడ్డి ఆరోపించారు. గతంలో మాదిరి కాకుండా కేవలం నామమాత్రపు రవాణా ఖర్చులతో ప్రజలకు తమ ప్రభుత్వం ఇసుకను ప్రజలకు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగప్రసాద్, తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరమ్మ, ఆర్ఐ ఆనందరావు, మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



వెంకటలక్ష్మి మృతదేహం

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 26: మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలోని తిరుపతి-చెన్నై ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఓ యువతి మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. వెంకటగిరికి చెందిన వెంకటలక్ష్మి(18) అనంతరాజు పేటలో ఉన్న తన బంధువుల ఇంటికి వచ్చి తిరిగి చెంచయ్య, శకుంతలతో కలిసి ద్విచక్ర వాహనంలో కోడూరు వెళ్తుండగా అనంతరాజుపేట వద్ద రాజంపేట వైపు వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. శకుంతల, చెంచయ్యలకు తీవ్ర గాయాలు కావడంతో కోడూరు ప్రభుత్వాసుపత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తర లించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్థల వివాదంలో కొల్లం గంగిరెడ్డిపై విచారణ

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 26: పట్టణంలోని ఓ ప్రైవేట్ స్థలం వివాదంలో సోమవారం ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డిని రైల్వే కోడూరు సీఐ హేమసుందర్ విచారించారు. అది ప్రైవేట్ స్థలం అని తనకు ఎటువంటి సంబంధం లేదని గంగిరెడ్డి పోలీసులకు చెప్పినట్లు సమాచారం. సమగ్రమైన విచారణ కోసం రాయచోటి ఎస్పీ కార్యాలయానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం.. 18 మందికి గాయాలు



పిచ్చికుక్క కరిసిన వ్యక్తి గాయం చూపుతున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 26: లక్కిరెడ్డిపల్లెలో ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసి 18 మందిని కరవడంతో గాయపడ్డారు. ఉయం 9 గంటల నుంచి పిచ్చికుక్క ఎక్కడ మనుష్యులు కనిపిస్తే.. అక్కడ వారిని కరిచి వెళ్లిపోయింది. కొంతమంది యువకులు కర్రలతో పిచ్చికుక్కపై దాడి చేయడంతో పరు గులు తీసి.. దారి వెంబడి కనిపించిన వారిని కరుస్తూ వెళ్లింది. గాయపడిన వారు ఆసుపత్రి పాలయ్యారు. డాక్టర్ ధరణికుమార్ బాధితులకు చికిత్సలు నిర్వహించారు. కాగా, లక్కిరెడ్డిపల్లెలో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉందని.. స్థానికులు పంచాయతీ అధికా రులకు ఫిర్యాదు చేశారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లి, అగస్టు 26: రెండు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఫారెస్ట్ డీఆర్ఓ రమేష్ బాబు తెలిపారు. సోమవారం ఉదయం 6గంటలకు సుండుపల్లి బీటు జిలకల బండ ప్రదేశంలో తనిఖీ నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు రెండు ఎర్రచం దనం దుంగలు తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఒక ద్విచ క్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన దుంగల విలువ రూ.28వేలు చేస్తుందని తెలిపారు. ఫారెస్టు సిబ్బంది స్వాతి, ప్రసన్న, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సుండుపల్లి, అగస్టు 26: పింఛా నదిలో నుంచి సోమవారం ఉదయం ఇసుక అక్ర మంగా తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకునట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గత కొద్ది రోజులుగా పింఛా నదిలో నుంచి ఇతర మండలాలకు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఈ మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరిలిస్తే పోలిసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

సుండుపల్లె మండలంలోని ఒకే ఊరికి చెందిన ఇరువర్గాల వారు దాడి చేసుకోవడంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం రాత్రి రాచంవాండ్లపల్లెకు చెందిన శ్రీరాములు, హరిక్రిష్ణ వర్గీయులు భూ తగాదాల విషయంలో దాడి చేసుకోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 26: ఆటో ఢీకొని గాయపడిన కూలీ డి.శివ (45) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ ఏఎస్ఐ రమణ తెలిపారు. కడప చిన్నచౌకుకు చెందిన శివ కూలీ పనుల కోసం మదనపల్లెకు వచ్చి చంద్రాకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 22న కూలీ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

- గిరిజన నృత్యాలతో ఘనంగా శోభాయాత్ర

రాయచోటిటౌన్, ఆగస్టు 26: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో సోమవారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు బుక్యే విశ్వనాథనాయక్, రాందాస్‌నాయక్, మదన్‌మోహన్‌నాయక్, రామానుజన్‌నాయక్, అన్నయ్యనాయక్, శంకర్‌నాయక్, బీలూనాయక్, నారాయణనాయక్‌ల ఆధ్వర్యంలో బంజారా యువతులు తేజ్ బుట్టలను నెత్తిన పెట్టుకుని షిరిడిసాయి ఆలయం నుంచి నేతాజీ సర్కిల్ వరకు గిరిజన నృత్యాలతో శోభాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారా పండుగలలో అతి ముఖ్యమైన పండుగ తీజ్ అని, ఈ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకని, తొమ్మిదిరోజుల పాటు జరిగే వేడుకన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు సస్యశ్యామలంగా ఉండాలని, బంజారా కన్నెపిల్లలు తేజ్‌బుట్టలు పెట్టి గోధుమ విత్తనాలు విత్తి తీజ్ దీక్ష చేపట్టి తొమ్మిది రోజుల పాటు నీరు పోసి నారుపెంచి వాటిని తీసుకెళ్లి నీటిలో కలిపేశారన్నారు. కార్యక్రమంలో తీజ్ కమిటీ సభ్యులు మూడే వినోద్‌నాయక్, తిరుపాల్‌నాయక్, రామాంజులునాయక్, రఘునాథనాయక్, చక్రేనాయక్, శ్రీనివాసులునాయక్, నాగమునినాయక్ తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు



గోధుమ గడ్డి బుట్టలు నెత్తిన పెట్టుకొని శోభాయాత్ర చేస్తున్న గిరిజన యువతులు

రసవత్తరంగా అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

- 2 వికెట్ల తేడాతో విజయం సాధించిన నెల్లూరు
- డ్రాగా ముగిసిన కడప- చిత్తూరు జట్ల మ్యాచ్



ఏసీఏ మైదానంలో క్రికెట్ పోటీల దృశ్యం

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 26: కడపలో ఏసీఏ అండర్-23 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా సోమవారం వివిధ జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. ఇందులో భాగంగా కర్నూలు- నెల్లూరు జట్ల మధ్య జరిగి మ్యాచ్‌లో 2 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. అలాగే కడప-చిత్తూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. వివరాలిలా...

నగర రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు-నెల్లూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 62 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 35.2 ఓవర్లలో 174 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో కర్నూలు జట్టుకు 85 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు 48.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌట్ అయ్యి.. 323 పరుగుల లక్ష్యాన్ని నెల్లూరు జట్టు ముందు ఉంచింది. ఇందుకు ప్రతిగా రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు మూడవరోజైన (సోమవారం) ఆట ముగిసే సమయానికి 67.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 323 పరుగులు చేసి 2 వికెట్లతో విజయం సాధించింది.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 102.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 450 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 64.5 ఓవర్లలో 245 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో చిత్తూరు జట్టుకు 205 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. కాగా రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు చివరి రోజైన సోమవారం 70 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 436 పరుగుల ఆధిక్యత సాధించింది. ప్రతిగా రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. ఇందులో కడప బ్యాటర్ శివకేశవ 71 పరుగులు చేశారు.

హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలి



సీఎం చంద్రబాబును కలిసిన ఆదిమూలం వెంకటేశ్

పెండ్లిమర్రి, ఆగస్టు 26: భూ వివాదానికి సంబంధించి తన అన్న ఆదిమూలం శ్రీనివాసులును హత్య చేశారని.. హత్య కేసులోని నిందితులను పోలీసుల అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తున్నారని సీఎం నారా చంద్రబాబునాయుడును కలిసి ఆది మూలం వెంకటేశ్ విన్నవించారు. ఇందుకు ఆయన స్పందించి నేరస్తులు ఎంతటివాళ్లయినా వదిలే ప్రసక్తి లేదన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలం యాదవపురం గ్రామానికి సంబంధించిన భూవివాదంలో ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద‌ర్‌రెడ్డి అనుచరులు నాగసుబ్బారెడ్డి, పి.చిన్నపుల్లారెడ్డిలు ఏప్రిల్ 1వ తేదీ మా అన్న ఆదిమూలం శ్రీనివాసులును అత్యంత దారుణంగా చంపారని.. వారిపై ఎఫ్ఐ ఆర్ ఉన్నప్పటికీ పోలీసులు అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నిమార్లు భూవివాదాన్ని పరిష్కరించాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోక పోవడంతోనే మా అన్న హత్యకు గురయ్యాడన్నారు. హత్య జరిగి నాలుగు నెలలు కావస్తున్నా ప్రధాన నిందితులుగా ఉన్న పెద్దగుర్విరెడ్డిగారి చిన్నపుల్లారెడ్డి, నాగపుల్లారెడ్డిలను ఇంకా అరెస్టు చేయకుండా విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. అందుకనే సీఎంను కలిసి విన్నవించుకున్నామన్నారు. ఇందుకు సీఎం స్పందించి భూవివాదం పరిష్కారం చేసి నేరస్తులను శిక్షిస్తామని హామీ ఇచ్చినట్లు ఆదిమూలం వెంకటేశ్ తెలిపారు.

హే కృష్ణా..ముకుందా..మురారి

● ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




ప్రత్యేక అలంకారంలో ద్వారకానగర్‌లోని శ్రీకృష్ణమందిరం.. స్వామివారి దర్శనానికి క్యూకట్టిన భక్తులు

చెన్నూరు/కడప (కల్చరల్)/కమలాపురం రూరల్/వేంపల్లె/ సీకే దిన్నె/కడప (క్రైం)/,ఆగస్టు26 : 'హే కృష్ణా.. ముకుందాం.. మురారి' అంటూ భక్తులు కృష్ణభగవానుని పూజించారు. సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్ని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్న కృష్ణుని వేషధారణలో చిన్నారులు అలరించారు. చెన్నూరు సీతారామ సంకీర్తన క్షేత్రం ఆవరణంలో రాధాకృష్ణ భజన మందిరంలో తెల్లవారుజామున నుంచే రాధాకృష్ణులకు అభిషేకాలు, పూజలు చేశారు. అలాగే కృష్ణం వందే జగద్గురుం అంటూ క్రిష్ణష్టకం పఠించారు. ఆలయ ఆవరణంలో గోపూజ నిర్వహించి గోమాతలను పూజించారు. మహిళలు పెద్దఎత్తున హాజరై గోపూజలో పాల్గొన్నారు. కాగా పలు ఇళ్లలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు చిన్నికృష్ణుడి వేషధారణలు చేసి ముచ్చటించారు. పలు వీధుల్లో సంవత్సరాలు, రెండు సంవత్సరాల బాలురు పలు వేషధారణలతో అలరించారు.

కడప నగరంలో... కృష్ణాష్టమి పర్వదినాన్ని కడప గనంరలో ఘనంగా జరుపుకున్నారు. ఇస్కాన్ భక్త బృందం ఆధ్వర్యంలో తిరుమల- తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేకంగా అలంకరించిన చిన్నికృష్ణయ్య విగ్రహానికి పూజలు, అభిషేక నిర్వహించారు.మధ్యాహ్నం 4.30 గంటలకు ఉట్లోత్సవం, రాత్రి 7కు మహా శంఖాభిషేకం, రాత్రి 8.30 గంటల నుంచి భక్తులకు స్వామివారి మహా ప్రసాద వితరణ నిర్వహించారు. అలాగే ద్వారకానగర్‌లోని కృష్ణమందిరంలో పూజలు నిర్వహించారు.

కమలాపురంలో బండలాగుడు పోటీలు

కమలాపురం పట్టణంలోని రాధాకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయం ఎనిమిదవ వార్షికోత్సవ సందర్భంగా ఈ ఆలయంలో ప్రత్యేక పూ జా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి సతీమణి శ్రీచైతన్య, యువనేత లక్ష్మీరెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి యువనేత లక్ష్మీరెడ్డితో కలిసి బండలాగుడు పోటీలు ప్రారంభించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. సాయంత్రం ఊంజల్ సేవ, చతుర్వేద పారాయణం, అర్చన, మంగళ హారతి, నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు చేపట్టనున్నారు. బండలాగుడు పోటీల్లో విజేతలకు వరుసగా రూ.40వేలు, 30వేలు, 20వేలు, పదివేలు, ఐదువేల టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, చైతన్యరెడ్డి, లక్ష్మీరెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతి అందించారు. టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, కంకర సుబ్బారెడ్డి, వాసుదేవరెడ్డి, రాఘవరెడ్డి, జంపాల నరసింహారెడ్డి, దివాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో... చింతకొమ్మదిన్నె మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చింతకొమ్మదిన్నె మండలం అప్పరాజుపల్లె వద్ద శ్రీకృష్ణ ఆలయంలో 4వ వార్షికోత్సవం సందర్భంగా కృష్ణాష్టమి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా భక్తులు చిన్నారులతో శ్రీకృష్ణుని వేషధారణ గావించి కనువిందు చేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణ చారిటబుల్ సభ్యులు అమర్‌నాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఊటుకూరులోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కల్యాణాన్ని వేద పండితులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి గ్రామోత్సవం భక్తుల సమక్షంలో కన్నుల పండువగా నిర్వహించారు.

కడప రాజారెడ్డి వీధిలో... స్థానిక రాజారెడ్డివీధిలోని షర్మిలా ఇంగ్లీషు మీడియం యూపీ స్కూలులో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు శ్రీకృష్ణ గోపిక రాధిక వేషధారణలతో అలరించారు. నృత్యాలతో చూపరులను ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు తమ తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వేంపల్లెలో... వేంపల్లె మండలంలో కృష్ణాష్టమి పర్వదినాన్ని వేడుకగా జరుపుకున్నారు. స్థానిక వడ్డె వీధిలోని క్రిష్ణాలయంలో డేరంగుల రామాంజనేయులు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. క్రిష్ణుని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అన్నదానం చేశారు. అలాగే అమ్మవారిశాలలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో క్రిష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం ఉట్టికొట్టే పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కుమరాంపల్లె సమీపంలో క్రిష్ణాలయంలో కృష్ణునికి పూజలు చేశారు. అన్నదానం చేశారు. రాజ్యసభ సభ్యులు న్రరెడ్డి తులసిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో క్రిష్ణాష్టమి వేడుకలు జరిగాయి. భక్తులు పాల్గొన్నారు.



కడప ద్వారకానగర్ శ్రీకృష్ణ ఆలయంలో భక్తులు



కడప: శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు



చెన్నూరులో పూజలందుకున్న రాధాకృష్ణులు





కడప: కృష్ణపరమాత్మునికి అభిషేకం చేస్తున్న భక్తులు



కమలాపురం: రాధాకృష్ణ ఆలయంలో పూజలు చేస్తున్న పుత్తా కుటుంబ సభ్యులు



అప్పరాజుపల్లెలో పూజలు అందుకుంటున్న శ్రీకృష్ణుడు



కృష్ణాష్టమి వేడుకలకు హాజరైన భక్తులు



వేంపల్లె: కృష్ణాష్టమి పూజలు చేస్తున్న భక్తులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ పురుషోత్తం రాజు

చెన్నూరు, ఆగస్టు 26: మండల కేంద్రమైన చెన్నూరులోని నాగలింగేశ్వర ఆలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు జరిగే ధ్వజస్తంభ, నవగ్రహ, ప్రతిష్ఠ కార్యక్రమాల్లో ఎవరైనా ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ పురుషోత్తం రాజు హెచ్చరించారు. సో మవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణంలో శాంతికమిటీ సమావేశం నిర్వహించి మత పెద్దలు, పలు పార్టీల నేతలతో మాట్లాడారు. చెన్నూరు ప్రశాంతతకు మారు పేరని, ఇక్కడ ప్రతి ఒక్కరూ శాంతియుత వాతవరణంలో జీవిస్తుటారని, అయితే కొందరు రెచ్చగొట్టే మాటలు మాట్లాడడం, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడడంలాంటివి చేస్తే సహించేది లేదన్నారు. అలాగే అటు నాగలింగేశ్వర ఆలయం, ఇటు మసీదు ఎదురెదురుగా ఉన్నాయి కాబట్టి ఇప్పటి వరకు ఎలా ప్రశాంత వాతావరణంలో కలిసిమెలిసి ఉన్నారో అదే పద్ధతిలో నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మతపెద్దలతో పాటు టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కె ట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, బలిజ సంఘం జిల్లా నేత ఆకుల ప్రసాద్‌బాబు, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, మైనార్టీ నేత షబ్బీర్ హుసేన్, వైసీపీ మండల కన్వీనరు జీఎస్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సత్యశ్రీ చిట్స్ 11వ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న చిట్‌ఫండ్ ఎండీ అండ్లూరి బాలక్రిష్ణారెడ్డి, కేఎస్ఆర్ఎం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 26 : కడప నగరం ఆర్ఎస్ రోడ్డులోని సత్యశ్రీ చిట్స్ ప్రైవేటు లిమిటెడ్ 11వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేఎస్ఆర్ఎం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని) హాజరయ్యారు. సత్యశ్రీ చిట్‌ఫండ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు 8వ డివిజను వైసీపీ ఇన్‌చార్జ్ అండ్లూరి బాలక్రిష్ణారెడ్డి, డైరెక్టరు, 8వ డివిజను కార్పొరేటర్ లక్ష్మీదేవిలను అభినందించారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ ప్రజలు దాచుకున్న డబ్బుకు భరోసా సత్యశ్రీ చిట్స్ అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఎఫ్ టైర్ల అధినేత నవనీశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ హరినారాయణ, వైసీపీ నాయకులు రాణా ప్రతాప్, సంస్థ మేనేజర్ ఎల్. మహదేవరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఎ.శివశంకర్‌రెడ్డి, కె.భానుప్రకాష్, ఎం.సుదర్శన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, వి.కాశీవిశ్వనాథ్ రెడ్డి, జి. శైలజ, ఎస్.ఎం. కుళ్ళాయిరెడ్డి, మునెయ్య, నరసయ్య, ప్రసాద్‌రెడ్డి, బీ.వి.శేషంరాజు, కె. లలిత, చంద్రశేఖర్‌రెడ్డితో పాటు నగర ప్రముఖులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.
నేత కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని) తదితరులు

శ్రీకృష్ణ ఆలయంలో బాలవికాస్ విద్యార్థుల కృష్ణాష్టమి వేడుకలు



సాంస్కృతిక కార్యక్రమంలో బాలవికాస్ పాఠశాల విద్యార్థులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 26 : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని కడప నగరం ద్వారకానగర్‌లోని శ్రీకృష్ణ ఆలయంలో బాలవికాస్ పాఠశాల విద్యార్థులు ఘనంగా క్రిష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో కృష్ణలీలలు అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమానికి వ్యాఖ్యతగా ముడియం కిశోర్‌కుమార్ వ్యవహరించగా ఆలయ కమిటీ చైర్మన్ రామమునిరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టరు గంగయ్య పాల్గొన్నారు.

ఘనంగా వికాస్ హరిక్రిష్ణ జన్మదిన వేడుకలు



వికాస్ హరిక్రిష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ శ్రేణులు, శ్రేయోభిలాషులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 26: కడప నగరం అక్కాయపల్లె వికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో పాఠశాల కరస్పాండెంట్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగర ప్ర ముఖులు, టీడీపీ శ్రేణులు హాజరై హరిక్రిష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. వికాస్ హరిక్రిష్ణ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు.

కడప ఎమ్మెల్యే వ్యాఖ్యలు అవగాహన రాహిత్యం

● మౌఖిక ఆదేశాలతో అధికారులు అయోమయం

● చెత్త పన్ను రద్దు జీఓ ఎక్కడ? ● మేయర్ సురేశ్‌బాబు



కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 26: చెత్త కలెక్షన్‌కు సంబంధించి కడప ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు అవగాహన రాహిత్యమని మేయర్ సురేశ్‌బాబు పేర్కొన్నారు. చెత్త పన్ను రద్దు చేయాలంటూ ప్రభుత్వం జీఓ ఏమైనా ఇచ్చిందా అని ప్రశ్నించారు. మౌఖిక ఆదేశాలతో ఇటు అధికారులు, అటు మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గాలకు గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టారన్నారు. కార్పొరేషన్ పాలకవర్గం నిరంతరం ప్రజాసేవకు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం మేయరు చాంబరులో కార్పొరేటర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్లు కడప ఎమ్మెల్యే వ్యవహార శైలి ఉందన్నారు. ముందు జీఓలపై అవగాహన కలిగి కార్పొరేషన్ విధివిధానాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. 2021 ఆగస్టులో వైసీపీ ప్రభుత్వం క్లాప్ ప్రవేశపెడుతూ జీఓను విడుదల చేసిందన్నారు. అదే సంవత్సరం కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో క్లాప్ రద్దు చేయాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2022 ఏప్రిల్‌లో అమలు చేయడంతో తప్పదు అనే పరిస్థితుల్లో కడప కార్పొరేసన్‌లో కూడా అమలు చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. కార్పొరేషన్‌పై అధిక భారం పడినప్పటికీ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అమలు చేశామన్నారు. అయితే చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే చెత్త పన్ను రద్దు చేస్తామని చెప్పారని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చాక క్లాప్ రద్దుపై ఎటువంటి జీఓ విడుదల చేయకుండా మౌఖిక ఆదేశాలు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. దీనిపై శాసనసభ్యురాలిగా అసెంబ్లీలో మాట్లాడాలని సూచించారు. ఇప్పటికే చిత్తూరు, తిరుపతి, ప్రొద్దుటూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో క్లాప్ ఆటోలను రద్దు చేశారన్నారు. మున్సిపల్ మంత్రి నారాయణ సొంత జిల్లాలో క్లాప్ ఆటోలు 15 మాత్రమే తిరుగుతున్నాయాన్నారు. కడప కార్పొరేషన్‌లో అయితే ఎక్కడా లేని విధంగా 70 ఆటోలు తిరుగుతు ఉన్నాయన్నారు. క్లాప్‌కు సంబంధించి జూన్, జూలై, ఆగస్టు నెలలకు రూ.5.60 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉందన్నారు. దీనిపై ప్రతి నెలా సంబంధిత మంత్రికి నోట్ పెట్టినప్పటికీ స్పందన లేదన్నారు. ఎమ్మెల్యే ఏదైనా మాట్లాడే ముందు ఇలాంటివన్నీ తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఒక ఎమ్మెల్యేగా హుందాగా వ్యవహరించాలి కానీ నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని, ఇది ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామలక్ష్మణ్‌రెడ్డి, షంషీర్, సూర్యనారాయణ, కె.బాబు, మల్లిఖార్జున, డివిజన్ ఇన్‌చార్జ్‌లు హిరన్, శ్రీరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1, 2 మెయిన్స్ పరీక్షల తేదీ ప్రకటించాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్రకార్యదర్శి లెనిన్‌బాబు



మాట్లాడుతున్న లెనిన్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 26 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్1, 2 మెయిన్స్‌తో పాటు జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ ఇతర ఉద్యోగ నియామక పరీక్షల తేదీలు తక్షణమే ప్రకటించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు కోరారు. సోమవారం హోచిమన్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతి యేటా జాబ్ క్యాలెండరు ఇస్తామని చెప్పి ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా నిరుద్యోగులను నిలువునా మోసం చేసిందన్నారు. తీరా ఎన్నికల ముందు నోటిఫికేషన్ ఇచ్చి పోయిందన్నారు. గ్రూప్ 1,2 ప్రాథమిక పరీక్ష ఫలితాలు విడుదల చేశారని, మెయిన్ పరీక్షలు వాయిదా వేశారన్నారు. అయితే ఎప్పుడు నిర్వహిస్తారనేది చెప్పపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. అలాగే డిగ్రీ, జూనియర్ కళాశాల డిగ్రీకళాశాల లక్చరర్ పోస్టుల నియమకాన్ని కూడా చేపట్టాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేశ్, నాయకులు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్టు

పులివెందుల టౌన్, ఆగస్టు 26: పులివెందుల పట్టణంలో సోమవారం ఇన్‌స్పెక్టరు ఉత్తర్వుల మేరకు పులివెందులలో నగరిగుట్ట, కదిరిరోడ్డులో సోమవారం పేకాట స్థావరాలపై ఎస్ఐ నారాయణ తన సిబ్బందితో రెండు చోట్ల పేకాట స్థావరాలపై దాడి చేశారు. 12 మంది వ్యక్తులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఇలాగే అక్కడ రూ.35910 స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.

జాతీయ సమ్మేళనాలను
జయప్రదం చేయండి

కడప (మారుతీనగర్)ఆగస్టు 26. విశాఖపట్నంలో వచ్చే సెప్టెంబర్ 1,2,3, తేదీలలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతమ్మలతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు.

ఆరోగ్యమాత ఉత్సవాలకు తరలిరండి

కడప (కల్చరల్), ఆగస్టు 26: కడప రైల్వేస్టేషన్ సమీపంలో వెలసిన ఆరోగ్యమాత తిరుణాల మహోత్సవాలు ఈనెల 29వ తేదీ గురువారం నుంచి ప్రారంభం కానున్నాయని, ఆ తల్లి ఆశీస్సులను పొందడం కోసం విశ్వాసులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆరోగ్యమాత యువత బృందం పిలుపునిచ్చారు. ఆ మేరకు సోమవారం స్థానిక ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో తిరుణాల ఉత్సవాల తాలూకు కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఆరోగ్యప్రదాయిని అయిన మరియతల్లి దీవెనలు అందుకునేందుకు యువత ప్రత్యేక విశ్వాసంతో ముందుకు రావాలని కోరారు.

29వ తేదీన పతాకావిష్కరణకు కర్నూలు మేత్రాసన పీఠాధిపతి బిషప్ గోరంట్ల జ్వానేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆరోగ్యమాత యువత అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, మాథ్యూ, వినీత్‌రాజ్, విమల్, నవీన్, ప్రేమ్‌చరణ్, సహాయరాజ్, అమృతస్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యుల జీవితాల్లో
వెలుగునింపిన వ్యక్తి మదర్‌థెరిసా

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 26 : కలకత్తా మురికివాడల్లో ఎందరో అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి మదర్‌థెరిసా అని కడప మాజీ డిప్యూటీ మేయర్ ఆరిఫుల్లా తెలిపారు. సోమవారం మదర్‌థెరిసా జయంతిని పురస్కరించుకుని తన కార్యాలయంలో మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మదర్‌థెరిసా తోటి వారికి సహాయం చేయడానికి తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి కష్టాల్లో ఉన్నవారికి వెదికి మరీ సహాయం అందించిన మహోన్నత వ్యక్తి అని చెప్పారు. మంచి గుణం మానవత్వం, సహాయ గుణం, దయ ఉన్న మనిషి అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్లా, గౌస్‌పీర్, సుబ్బరాయుడు, బాబ్జి, రమణమూర్తి పాల్గొన్నారు.

మానవతా మూర్తి మదర్ థెరిసా

కడప (కల్చరల్), ఆగస్టు 26: అనాథలు, రోగులకు సేవలందించిన గొప్ప మానవతా మూర్తి మదర్‌థెరిసా అని ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ ఆసిఫ్ కొనియాడారు. మదర్‌థెరిసా జయంతిని పురస్కరించుకుని రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన మదర్‌థెరిసా పోస్టర్లను సోమవారం స్థానిక ఎం.ఎం.హాస్పిటల్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మిషనరీ ఆఫ్ ఛారిటీస్ అనే సంస్థను మదర్‌థెరిసా స్థాపించి భారతదేశంలోనే కాకుండా ఇతర దేశాలలో సైతం అనాదలకు ఆమె సేవలందించడం జరిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆర్ఆర్ సంస్థ అధ్యక్షులు కరీముల్లా, కమలా ప్రియదర్శిని, సౌమ్య, అయ్యవారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ తప్ప ఇతర స్కీంలు అంగీకరించం: యూటీఎఫ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 26 : పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాల్సిన ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేయకుండా యూపీఎస్ పేరుతో కొత్త పెన్షన్ విధానం తీసుకురావడాన్ని యూటీఎఫ్ వ్యతిరేకిస్తోందని, పాత పెన్షన్ అమలుకు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈ నెల 30న అన్ని తాలుకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్దఎత్తున ఈ నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత రాష్ట్ర ప్రభుత్వం 2022 ఏప్రిల్ 25న సీపీఎస్ స్థానంలో జీపీఎస్‌విధానం ముందుకు తీసకువచ్చిందని, దీన్ని యూటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, నాయకులు ప్రభాకర్, గోపినాథ్, చంద్రశేఖర్, సురేశ్‌కుమార్ కరీముల్లా, క్రిష్ణాఋెడ్డి, కేదార్‌నాథ్, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే అర్హత లేదు: టీడీపీ



మాట్లాడుతున్న పాలగిరి పెద్ద సుబ్బారెడ్డి

చెన్నూరు, ఆగస్టు 26 : తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యేలకు లేదని తెలుగు యువ త జిల్లా నాయకుడు పాలగిరి పెద్దసుబ్బారెడ్డి పేర్కొన్నారు.సోమవారం చెన్నూరులో మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కమలాపురం మాజీ ఎమ్మెల్యే అధికారం కోల్పోవడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని కాపాడుకునేందుకు ఏదేదో మాట్లాడుతున్నాడన్నారు. మేనిఫెస్టోలో ఏం చెప్పారో అందులోని ప్రతి ఒక్కటీ తప్పకుండా అమలు చేసి తీరుతారన్నారు. అలాగే కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సర్వరాయసాగర్‌కు నీళ్ల వచ్చేలా చేశారన్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే ఆ నీటిని పంటల అవసరాలకు వాడుకోవాలి తప్ప చేపల చెరువులకు కాదన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



పోలీసుస్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

వేంపల్లె, ఆగస్టు 26 :వేంపల్లె పాపాఘ్ననది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్ఐ రంగారావు పట్టుకున్నారు. అందిన సమాచారంతో దాడులు నిర్వహించగా పాపాఘ్ని నది నుంచి ఇసుక తీసుకెళుతున్న ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. సెబీ అధికారులకు ట్రాక్టర్లను అప్పగించినట్లు సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు.

టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవికుమార్



వేంపల్లె, ఆగస్టు 26 :టెన్నికాయిట్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా వేరపల్లెకు చెందిన ఎస్‌బీ రవికుమార్ నియామకం అయ్యారు. కార్యదర్శిగా వేంపల్లె ఎంఈవో స్టాలిన్ నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లాలో టెన్నికాయిట్ అభివృద్ధికి కృషి చేస్తామని పాఠశాల స్థాయిలో విద్యార్థులు టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనేలా ఆసక్తిని పెంపొందిస్తామని నూతన అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు.

గంజాయిని తరలిస్తే చర్యలు

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 26:గంజాయిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ భక్తవత్సలం హెచ్చరించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో కొందరు ప్రైవేట్ బస్సు యజమానులతో సమావేశమై మాట్లాడుతూ ట్రావెల్స్ ద్వారా ప్రధాన నగరాల నుంచి ప్రొద్దుటూరుకు అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు.

టీడీపీ యాప్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న పుట్టా

ఖాజీపేట, ఆగస్టు 26: ప్రభుత్వం చేసే పనులను టీడీపీ యాప్ ద్వారా ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన స్వగృహంలో నారా లోకేశ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఖాజీపేట మండలం పాటిమీదపల్లెకు చెందిన పుట్టే రాముకు ప్రథమస్థానం, వనిపెంటకు చెందిన ఓబులేసుకు ద్వితీయ స్థానం, మైదుకూరు బాలాజీకి తృతీయ స్థానం ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అందజేశారు. ప్రతి కార్యకర్తను గుర్తించుకుని వారికి తగిన న్యాయం చేస్తుందన్నారు.

మైదుకూరు రూరల్..: టీడీపీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పార్టీ యాప్ ద్వారా ప్రజలకు తెలియచేస్తు తద్వారా ఉత్తేజపరుస్తున్న టీడీపీ నాయకుడు యల్లుగాళ్ల బాలాజీకి సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రశంసా పత్రాన్ని అందించారు. మంత్రి నారా లోకేశ్ ప్రశంసిస్తూ పంపిన లేఖను ఈ సందర్భంగా బాలాజీకి అందచేశారు.

సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించాలి



మాట్లాడుతున్న మాధవీలత

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 26: సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించాలని బాల్యం నుంచే చిన్నారులకు నేర్పించాలని హైదరాబాదు బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాధవీలత పేర్కొన్నారు. ఆదివారం కామనూరులోని ప్రసన్న వేణుగోపాలస్వామి గోశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందువులంతా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరావు, వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీనరసయ్య, మల్లికార్జునావు, నాగమునిరెడ్డి, వంకధార వీరభద్రయ్య, మార్కండేయ, చలపతి, చిప్పగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయిని తరలిస్తే చర్యలు

● డీఎస్పీ భక్తవత్సలం



ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 26 : గంజాయిని ఎవరైనా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ భక్తవత్సలం హెచ్చరించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో కొందరు ప్రైవేట్ బస్సు యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రావెల్స్ ద్వారా ప్రధాన నగరాల నుంచి ప్రొద్దుటూరుకు అక్రమంగా స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తెలిసిందన్నారు. కొన్ని రోజుల నుంచి విశాఖపట్టణం నుంచి ప్రొద్దుటూరుకు అక్రమంగా ట్రావెల్స్ ద్వారానే గంజాయి తరలిస్తున్నట్లు తెలిసిదన్నారు. ట్రావెల్స్ యజమానులు ఇక జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు పాల్గొన్నారు.

ముమ్మరంగా మిరప సాగు



మిరపనారు నాటుతున్న కూలీలు

మైలవరం, ఆగస్టు 26 : మండలంలోని కల్లుట్ల, బెస్తవేముల, చిన్నకొమెర్ల, తొర్రివేముల, నార్జంపల్లి తదితర పంచాయతీల్లో వారం రోజులుగా మిరప నాట్లు వేస్తూ రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. మిరప విత్తనాలను మైదుకూరు. ముద్దనూరు, బనగానపల్లి, తదితర నర్సరీల్లో పోయడంతో 40 రోజులు దాటడంతో వర్షాలు పూర్తి స్థాయిలో పడకపోయిన బోర్ల ద్వారా నీరు పెట్టి మిరప నాట్లు వేస్తున్నారు. వర్షం ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పడకపోయినా వచ్చే రోజుల్లో వర్షం వస్తుందన్న ఆశతో నాట్లు వేస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. గత ఏడాది మిరప నాటినా వర్షాలు లేక పూర్తిగా నష్టపోయామని ఇంత వరకు ప్రభుత్వం రైతులకు ఎలాంటి నష్టం పరిహారం అందించలేదని వారు వాపోతున్నారు. మైలవరం, నార్జాంపల్లి, చిన్నకొమెర్ల, తొర్రివేముల తదితర పొలాలకు మైలవరానికి నీరు వస్తే పంట పొలాలకు ఇబ్బంది ఉండదు. వర్షాలు బాగా కురిస్తే పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని లేకుంటే ఇబ్బందులు తప్పవని రైతులు అంటున్నారు. మిరప సాగు చేసే రైతులు గంపెడాశతో నాటు వేసే పనిలో నిమగ్నమయ్యారు. గత ఏడాది 3 వేల హెకార్లకుపైగా మిరప సాగు చేశారు. ఈ సారైనా దేవుడు కరుణించి పంటలు బాగా పండాలని ఆశతో సాగు చేస్తున్నామని రైతులు తెలిపారు.

ఘనంగా మదర్‌థెరిస్సా జయంతి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 26: మదర్‌థెరిస్సా జయంతిని ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో 200 మంది రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవిచంద్ర, టీటీడీ మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్‌లు , ఆదరణ సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, సి.వి.సురేంద్రబాబు, శ్రీనివాసులు, మాధవ, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు





జమ్మలమడుగులో శ్రీకృష్ణ భగవానుని ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం, ప్రొద్దుటూరులోని అనిబిసెంట్ స్కూల్లో ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలకు హాజరైన భక్తులు

బద్వేలు, ఆగస్టు 26: కృష్ణాష్టమి వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం భక్తి, శ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బద్వేలు పట్టణంలోని అనంతగిరి క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీ కృష్ణ గీతామందిరంలో కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా రుక్మిణి, శ్రీకృష్ణుల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తి, శ్రద్ధలతో పూజించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారికి ముత్యాలను గంగసాని సాంబశివారెడ్డి, సతీమణి లక్ష్మీదేవి అందజేశారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. నెల్లూరు రోడ్డులోని కృష్ణమందిరం, రెడ్డెయ్యమఠం వీధిలోని శ్రీకృష్ణ ఆలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఆయా మందిరాలలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కొండాపురం..: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు బారీ ఎత్తున తరలి వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పోరుమామిళ్ల..: కృష్ణాష్టమి వేడుకలు పోరుమామిళ్లలో ఘనంగా జరిగాయి, సోమవారం కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ పెసల నరసింహులు పాల్గొన్నారు. అలాగే పోరుమామిళ్లలో పలువురు చిన్నారులు శ్రీకృష్ణ గోపిక వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

అట్లూరు..: మండలంలో కృష్ణుని ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు కొండూరు పడమటి భాగాన కొండల్లో వెలసిన గోపాలస్వామి కొండకు భక్తులు వెళ్లి పూజలు చేశారు. క్రిష్ణుని ఆలయాల్లో భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎర్రగుంట్ల..: ఎర్రగుంట్ల మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పోట్లదుర్తి పెన్నాతీరంలో వెలసిన శ్రీక్రిష్ణాలయంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజ లు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో చిన్నారులు శ్రీక్రిష్ణుడి వేషదారణ వేసి అలరించారు.

బద్వేలు రూరల్..: కృష్ణాష్టమి పర్వదిన సందర్భంగా పట్టణంలోని పలు శ్రీకృష్ణ ఆలయాల్లో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోరుమామిళ్ల రోడ్డులోని రెడ్డయ్యమఠంవీధిలో ఉన్న శ్రీకృష్ణాలయంలో క్రిష్ణునికి ప్రత్యేక పూజలు చేసి యువకులకు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే నెల్లూరురోడ్డులోని శ్రీకృష్ణ ఆలయం, నాగులచెరువుకట్ట వద్ద ఉన్న శ్రీకృష్ణాలయంతో పాటు పలు క్రిష్ణాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉట్టికొట్టిన యువకులకు బహుమతులు ప్రదానం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. త్రైతసిద్ధాంత ప్రభోదసేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో డాక్టర్ ఎంపీ మునిరెడ్డి కాంప్లెక్స్ ఎదురుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులు శ్రీకృష్ణుడు విగ్రహాన్ని పల్లకీసేవలో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు విశేషంగా పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంత కమిటీ, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

మైలవరం..: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని వేపరాల, కరమలవారిపల్లి, మైలరవం, దొమ్మరనంద్యాల తదితర గ్రామాల్లో యాదవ సంఘాల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. చిన్నారులు వేసిన వేషదారణలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ప్రొద్దుటూరు టౌన్..: అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకలను ఇస్కాన్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు శ్రీకృష్ణ బలరాములకు విశేష అభిషేకాలు, అలంకరణలు, హరినామ సంకీర్తన, కృష్ణ లీలా ప్రవచనం, గౌర హారతి, భగవద్గీత ప్రవచనాలు నిర్వహించారు. రాత్రి 10 గంటలకు మహాశంకాభిషేకం, మహాపుష్పాభిషేకం, మహాహారతి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా 30 వేల మంది భక్తులకు ఇస్కాన్ నిర్వాహకులు అన్నప్రసాద వినియోగం చేశారుశ్రీకృష్ణున్ని దర్శించుకుంటే పాపాలు పోతాయి



పోరుమామిళ్లలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



ఖాజీపేటలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఖాజీపేట..: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని సోమవారం అమ్మవారిశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అలాగే కొన్ని ప్రైవేటు పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య జిల్లా ఉపాధ్యక్షుడు కాటా నరసింహారావు మాట్లాడుతూ కలియుగంలో శ్రీకృష్ణుని నామం పలికితే పాపాలు పోతాయని తెలిపారు. ఈ వేడుకల్లో స్వామివారికి అటుకులు, బెల్లం నైవేద్యంగా పెట్టి భక్తులకు పంపిణీ చేశారు.

కాలువల్లో పెరిగిన జంబు... ఇబ్బందుల్లో రైతులు

జమ్మలమడుగు, ఆగస్టు 26: జమ్మలమడుగులోని ఉత్తర, దక్షిణ కాలువల్లో జంబు పెరిగింది. మైలవరం జలాశయం వద్ద నుంచి ఉత్తర కాలువ, దక్షిణ కాలువలో జంబు పెరగడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పంట పొలాలకు నీరు లేక వర్షాలు అంతంతమాత్రమే ఉండి ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కొన్ని గ్రామాల్లో వర్షం కురిసింది. అయితే మైలవరం జలాశయం నుంచి ఉత్తర, దక్షిణ కాలువలకు లీకేజీ నీరు, వర్షపునీరు నిలువ ఉండడంతో ఆ నీటిని రైతులు కాలువల పక్కన మోటార్లతో నీటిని లాగుతున్నారు. జంబు పెరగడంతో అందులో విషపురుగులు ఉన్నాయని, దీంతో ఇబ్బందికరంగా మారిందని వెంటనే తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.



ఉత్తర కాలువలో పెరిగిన జంబు

ఒకటి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

మైదుకూరు రూరల్ ,ఆగస్టు 26 : భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సెప్టెంబరు1వ తేది నుంచి ప్రారంభమవుతుందని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు సోమవారం తమ పార్టీ కార్యాలయంలో తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు,వైస్ ప్రెసిడెంట్ గజ్జల రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం మన కర్తవ్యం అని తెలిపారు.సెప్టెంబరు 1 నుంచి 25 వరకు నమోదు కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమోహన్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకీకృత పెన్షన్ ఆమోదయోగ్యం కాదు

బద్వేలు, ఆగస్టు 26: కేంద్రప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్ ఆమోదయోగ్యం కాదని , దానిని అంగీకరించే ప్రశ్నే లేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎన్‌జీవో హోంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగా కేంద్రప్రభుత్వం కేవలం ఎన్‌పీఎస్ పేరును యూపీఎస్‌గా మార్చిందని ఆరోపించారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయం ఇందులో ప్రస్తావించకపోవడం పై గా ఈ పథకం అమలు ఐచ్చికం అని పేర్కొనడంలో అసలు మోసం దాగి ఉందన్నారు. కేంద్రప్రభుత్వం ఎత్తుగడ, మోసపూరిత వ్యూహంగా ఉందని ఆరోపించారు. పాత పెన్షన్ అమలు కోసం ఎఫ్ఆర్డీఏ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో బద్వేలు మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, ట్రెజరర్ గుర్రయ్య, గోపవరం మండల అధ్యక్షుడు వీరదాసరి క్రిష్టఫర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎస్.ఎం.డి .గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా చెక్‌డ్యాంలు

● వృథాగా పోతున్న సాగునీరు



తిప్పిరెడ్డిపల్లె వద్ద దెబ్బతిన్న చెక్‌డ్యాం

చాపాడు, ఆగస్టు 26: మండలంలోని పలు గ్రామాల వద్ద నిర్మించిన చెక్‌డ్యాంలు నామరూపాలు లేకుండా ఉన్నాయి. 30 ఏళ్ల క్రితం వీటిని నిర్మించారు. వంకలు, వాగులకు అడ్డంగా ఈ చెక్‌డ్యాంలు నిర్మించారు. ఈ చెక్‌డ్యాంలు నిర్మిస్తే వంకల్లో పారుతున్న తాగునీరు ఒకవైపు నిలువ ఉంటుంది. ఈ నీటితో రైతుల భూములకు తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం వీటిని నిర్మించింది. తిప్పిరెడ్డిపల్లె, పల్లవోలు, మదూరు, శ్రీరాములపేట, గుంతచీపాడు, సోమాపురం, వెదురూరు, కుచ్చుపాప, ఓబుళరెడ్డిపేట గ్రామాల వద్ద నిర్మించారు. తిప్పిరెడ్డిపల్లె, గుంతచీపాడు గ్రామాల వద్ద మాత్రమే చెక్‌డ్యాంలు కొంతమేర మిగిలి ఉన్నాయి. మిగిలిన ఏడు గ్రామాల వద్ద చెక్‌డ్యాంలు పూర్తిగా దెబ్బతిని నామరూపాలు లేకుండాపోయాయి. దీంతో చెక్‌డ్యాంలు ఎక్కడ ఉన్నాయో కూడా గ్రామస్థులు కనుక్కోలేని పరిస్థితి ఉంది. చెక్‌డ్యాంలు ఉన్నప్పుడు ఆ గ్రామాల రైతులు ఏడాదికి రెండుసార్లు పంటలు పండించేవారు. చెక్‌డ్యాంల వద్ద సాగునీరు గుంతల్లో నిలువ ఉండడంతో వ్యవసాయ ఫిల్టర్ల ద్వారా నీటిని తోడుకునేవారు. కానీ ఈ చెక్‌డ్యాంలు పూర్తిగా దెబ్బతినడంతో వంకల్లో సాగునీరు నిలువ ఉండడం లేదు. వర్షపునీరు, పొలాల్లోని నీరు చెక్‌డ్యాంలు లేకపోవడంతో కిందిప్రాంతాలకు పారిపోతున్నాయి. దీంతో భూములకు సాగునీరు అందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న రెండు చెక్‌డ్యాంలకు రెండువైపులా గోడలు పగిలిపోయాయి. వర్షాకాలంలో వంకల్లో వర్షపునీరు ప్రవహిస్తే ఒకసారి మాత్రమే ఖరీఫ్‌లో రైతులు పంటలు పండించుకుంటున్నారు. రెండో పంట సాగు చేసేందుకు వీలులేకుండాపోయింది. వరి, వేరుశనగ, నువ్వులు, కొర్ర వంటి పంటలు సాగు చేస్తారు. ఈ చెక్‌డ్యాంల కింద సుమారు 3 వేల ఎకరాల్లో భూములు ఉన్నాయి. నరహరిపురం, బసిరెడ్డిపల్లె, పీవీపల్లె, గుంతచీపాడు, చియ్యపాడు, భద్రిపల్లె, ఓబుళరెడ్డిపేట, మరికొన్ని గ్రామాల వద్ద భూములకు సాగునీరు అందకపోవడంతో సుమారు రెండు వేల ఎకరాలు బీడుగా పడి ఉన్నాయి. ఈ భూములన్నీ వర్షాధార పంటలకు నిలయంగా మారాయి. ముందుగా వ్యవసాయం జూదంగా మారడం, కష్టపడి పండించిన పంటలకు ఆదాయం లేకపోవడంతో రైతుల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. దీనికితోడు రెండో పంట సాగుచేయకపోవడంతో రైతుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందలేకపోతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంతమంది ఎమ్మెల్యేలు గెలిచినా ఈ చెక్‌డ్యాంల గురించి ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదని ఆ గ్రామాల రైతులు విమర్శిస్తున్నారు. గతంలో పలుమార్లు చెక్‌డ్యాంలు నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నప్పటికీ ఏ ఒక్కరూ కరుణించలేదన్నారు.



కుంగిన చెక్‌డ్యాం

గుంతలు పూడ్పించిన పోలీసులు

పోరుమామిళ్ల, ఆగస్టు 26 : పోరుమామిళ్లలో గుంతలు పడిన రహదారుల్లో ట్రాక్టర్లతో ఇటుక బట్టీల నుంచి మట్టి తెప్పించి గుంతలు పూడ్చించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారు పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి. సోమవారం పోరుమామిళ్లలో ప్రధాన రహదారుల్లో గుంతలు పడ్డ ప్రాంతాల్లో మట్టితో గుంతలను పూడ్చించడంతో ద్విచక్రవాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేసినట్లయింది.



బీఎస్ నారాయణరెడ్డికి నందమూరి తారకరామారావు నేషనల్ అవార్డు

కాశినాయన ఆగస్టు26: మండలంలోని మిద్దెల గ్రామానికి చెందిన ఆర్ట్‌ఆఫ్ లివింగ్ యోగాటీచర్, సంఘసేవకుడు బుసిరెడ్డి శివనారాయణరెడ్డి 2024 సంవత్సరం నందమూరి తారకరామారావు నేషనల్ అవార్డుకు ఎంపికఅయ్యారు. సోమవారం మదర్ సర్వీస్ సొసైటీ సేవాసంస్థ రెండో వార్షికోత్సవం సందర్భంగా విజయవాడ లోని అక్కినేని నాగేశ్వర్‌రావు కళా కేంద్రంలో ఆసంస్థ వ్యవస్థాపకుడు ఎం.ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో స్వచ్ఛంద సేవలు అందిస్తున్న పలువురిని గుర్తించి అవార్డుతో సత్కరించారు. ఇందులో భాగంగానే బీఎస్ నారాయణరెడ్డిని గుర్తించి అవార్డు అందజేసి సత్కరించారు. ఈకార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సభ్యుడు సుధాకర్‌రావు, ఆపద్బాంధవ సేవసంస్థ వ్యవస్థాపకులు మధుసూదన్‌రావు, శ్రీసోముశ్రీనివాసులరెడ్డి, ట్రస్టు వ్యవస్థాపకుడు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

